క్లుప్తంగా

నేడు ఆధార్ స్పెషల్ డ్రైవ్

ప్రొద్దుటూరు కల్చరల్: జాతీయ తపాలా వారోత్సవాల సందర్భంగా తపాలా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆధార్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జి.కిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరు ప్రధాన తపాలా కార్యాలయం, హోమస్‌పేట, పులివెందుల, మైదుకూరు ప్రధాన తపాలా కార్యాలయాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ డ్రైవ్ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

కాశినాయన: మండలంలో భూ సమస్యలను పరిష్కరిస్తామని బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సావిశెట్టిపల్లె, మూలపల్లె గ్రామాల్లో వివాదంలో ఉన్న భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచారణ చేపట్టి భూ సమస్యలను పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దారు వెంకటసుబ్బయ్య, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, స్థానిక వీఆర్ఓ, రైతులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నియంత్రణకు కృషి

బద్వేలు అర్బన్: హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి సకాలంలో వైద్యసేవలు అందించి మాతాశిశు మరణాల నియంత్రణకు కృషి చేద్దామని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్ తెలిపారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత్ అభియాన్ కార్యక్రమంలో పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ విశ్వంత, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశ్రమ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి

కాశినాయన: మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాశినాయన ఆశ్రమ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని ఢిల్లీలో కేంద్ర అటవీశాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర మంత్రిని కలిసి కాశినాయన ఆశ్రమ నిర్మాణానికి 15 హెక్టార్లు భూమిని కేటాయించాలని, అలా కేటాయిస్తే మరోక చోట 15 హెక్టార్లు భూమిని అటవీశాఖకు కొనుగోలు ఇస్తామని తెలిపారు.

అనాథ వ్యక్తికి అంత్యక్రియలు

కలసపాడు: మండలంలోని కరణంవారిపల్లె గ్రామానికి చెందిన ఈశ్వరయ్య తల్లిదండ్రులు లేక అనాథగా మారాడు. బంధువుల ఆదరణతో బ్రతికేవాడు. కాలక్రమంలో గుండెకు రంధ్రం పడి ఆరోగ్యం క్షీణిస్తుండటంతో మానసికంగా కృంగిపోయాడు. ఎప్పుడూ ఒక శూన్యస్థితిలో ఉండి తరచూ అనారోగ్యాల బారిన పడుతుండటంతో ఆయనను ఓబుళాపురం వద్ద ఉన్న వివేకానంద సేవాశ్రమంలో సంవత్సరం క్రితం చేరాడు. క్రమేనా ఈశ్వరయ్య ఆరోగ్యం క్షీణించడంతో మంచానికే పరిమితమై బుధవారం మరణించాడు. సేవాశ్రమం నిర్వాహకులు రామకృష్ణారెడ్డి ఈశ్వరయ్య మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

పేరుకే ఉచిత ఇసుక



సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత ఇసుక బ్యానర్


ఎద్దుల బండిపై తరలిస్తున్న ఇసుక

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇసుక ఉచితంగా ఇస్తున్నామని ఆర్భాటంగా ప్రకటిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థ కూడా ఏర్పాటు చేశారు. అయితే ఆచరణలో మాత్రం ఉచిత ఇసుక విధానం విఫలమైందని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- టిప్పర్ రూ.20 వేలకు పైమాటే
- ఎద్దుల బండ్ల ద్వారా సరఫరా

ప్రొద్దుటూరు: జిల్లాలో కడప తర్వాత ప్రొద్దుటూరు పెద్ద పట్టణం, వ్యాపార కేంద్రంగా ఉంది. వ్యాపార రంగంతోపాటు నిర్మాణ రంగం బలంగా ఉంది. నిత్యం వాణిజ్య సముదాయాలు, అపార్ట్ మెంట్లు, సొంత ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. లక్షల రూపాయలు ఖర్చు చేసి సొంత ఇళ్లను నిర్మిస్తున్నారు. వీటిపై ప్రస్తుతం ఇసుక ప్రభావం తీవ్రంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పార్టీ నాయకులు పెన్నానది పరిసరాల్లో ఉన్న ఇసుకను ఉన్న కాడికి ఊడ్చేశారు. రాత్రింబవళ్లు టిప్పర్లు, జేసీబీలు పెట్టి దోచేశారు. కొత్త ఎస్పీ వచ్చిన తర్వాత ఇసుక రవాణాపై గట్టి నిఘా ఏర్పాటుచేయడంతో అక్రమ రవాణాకు కొంత బ్రేక్ పడినట్లయింది.

ఆచరణ అంతంతమాత్రమే

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత ఇసుక విధానం ఆచరణలో విఫలమవుతోంది. ఇసుక అందక కొద్ది రోజులుగా నిర్మాణ రంగం కుంటుపడిందని చెప్పవచ్చు. ప్రొద్దుటూరు పరిధిలో ఇసుక రీచ్ లేకపోవడం.. ఆ రంగానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది. గత వారం రోజులుగా కొండాపురం నుంచి ఇసుక రవాణా చేస్తున్నారు. టిప్పర్ ఇసుక ధర రూ.24 వేలకు పైగా వెచ్చించి కొనుగోలు చేస్తున్నామని ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో పనులు చేపడుతున్న ఓ కాంట్రాక్టర్ సాక్షికి తెలిపారు. ఉచితమనేది పేరుకేనని ఆయన పేర్కొన్నారు.

ఉచిత ఇసుక విధానం సరిగా లేదు


ఉచిత ఇసుక విధానం లోపభూయిష్టంగా ఉంది. ఇసుక లేక భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందిపడుతున్నారు. ఎక్కువ మంది ఎద్దు బండ్ల ద్వారా ఇసుకను కొనుగోలు చేస్తున్నారు. బండి ఇసుక రూ.1500 నుంచి రూ.2 వేల వరకు పలుకుతోంది.
– గురు మోహన్‌రెడ్డి, భవన నిర్మాణ కార్మికుడు, ప్రొద్దుటూరు

ఇసుకతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి


ఇసుక లేని కారణంగా ఇల్లు కట్టాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎక్కువ మంది ఎడ్ల బండ్లతోనే ఇసుక కొనుగోలు చేస్తున్నారు. చాలా మంది టిప్పర్ల ద్వారా కొనుగోలు చేయలేకపోతున్నారు.
– జి.రామాంజులరెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు, ప్రొద్దుటూరు

పంటల బీమాపై రైతులకు స్పష్టత ఇవ్వండి


మాట్లాడుతున్న ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్

ఖాజీపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పంటల బీమా మొత్తం ప్రభుత్వం చెల్లించేంది.. ఇప్పుడున్న ప్రభుత్వం చెల్లిస్తుందా లేక రైతులే చెల్లించాలా అనేదానిపై స్పష్టత ఇవ్వాలని ఏఓను సభ్యులు నిలదీశారు. ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ శాఖ సమస్యలపై వైఎస్సార్ సీపీ సర్పంచ్ నాగేశ్వర్‌రెడ్డి, అమరేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు సభ్యులు నిలదీశారు. మండలంలో యూరియాతో పాటు డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల కొరత ఉందన్నారు. దీనిపై ఏఓ సుమంత్‌రెడ్డి స్పందించి యూరియా కొరత ఉన్న మాట వాస్తవం, అయితే రైతుభరోసా కేంద్రాలకు యూరియా సరఫరా అవుతోందన్నారు. రైతులు సహకరిస్తే అందరికి సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీటీసీలు రాముడు, మున్వర్, కనపర్తి సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, చంద్రభాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు చిన్నారెడ్డి, అమరేశ్వర్‌రెడ్డి తోపాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే లక్ష్యం

ఖాజీపేట: ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. మండలంలోని కన్నెలవాగు చెరువుకు నీటిని బుధవారం ఆయన విడుదల చేశారు. తెలుగు గంగ కాలువ నుంచి వచ్చే నీటిని ప్రత్యేక కాలువ ద్వారా చెరువులోకి విడుదల చేశారు. అనంతరం చెరువు వద్దకు వెళ్లి చెరువు పరిస్థితిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్నెలవాగు చెరువుకు కేవలం కొండల్లో వచ్చే వర్షం నీరే ఆధారమన్నారు. అయితే తెలుగు గంగ ద్వారా వచ్చే నీటిని చెరువు పంపడం వల్ల చెరువుకు నీరు చేరుతుందన్నారు. దీంతో చుట్టు పక్కల భూగర్భ జలాలు పెరిగి రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు బొగ్గుల చంద్ర ఓబుల్‌రెడ్డి తోపాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పెళ్లిసందడి


నూతన వధూవరులతో ఎంపీ, ఎమ్మెల్సీ నాయకులు

పోరుమామిళ్ల: రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, ఓఎల్ఎఫ్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆరోగ్యరాణిల ఏకైక కుమారుడు గిరిప్రణీత్‌రెడ్డి–అమితల వివాహం పోరుమామిళ్లలో బుధవారం జరిగింది. వివాహానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాదరెడ్డి, అంజద్‌బాష, కమలమ్మ, మేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, స్టేట్ ఫుడ్‌కార్పొరేషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి, పీఆర్ ఆర్‌డీ రాష్ట్ర మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి, పార్టీ నాయకులు, అధికారులు వధూవరులను ఆశీర్వదించారు.

పురోగతి కనిపించని ట్రాక్టర్ చోరీ కేసు

గోపవరం: మండలంలోని టీ.సండ్రపల్లె గ్రామంలో ఈ ఏడాది జూన్ 5వ తేదీ అర్ధరాత్రి చోరీకి గురైన ట్రాక్టర్ విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి కనిపించలేదు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు నారపురెడ్డి వేణుగోపాల్‌రెడ్డికి చెందిన ట్రాక్టర్‌ను రోజు మాదిరే ఇంటి బయట ఉంచడం జరిగింది. ఈ ఏడాది జూన్ 5వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌ను తీసుకెళ్ళారు.

ఉదయం లేచి చూడగా ఇంటి బయట ఉన్న ట్రాక్టర్ లేకపోవడంతో బద్వేలు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ రవికుమార్, సిబ్బంది ట్రాక్టర్ చోరీకి గురైన విషయంపై విచారించి చుట్టుపక్కల గాలించడం జరిగింది. ట్రాక్టర్ చోరీకి గురై నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఈ కేసులో ఎలాంటి పురోగతి కనిపించ లేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ ఎన్నికల కౌంటింగ్ ముగిసిన 24 గంటలలోపే ఇంటి ఆవరణలో ఉన్న ట్రాక్టర్‌ను అర్ధరాత్రి సమయంలో తీసుకెళ్ళడంపై పలు అనుమానాలు రావడం జరిగింది. ఆ కోణంలో కూడా పోలీసులు విచారించినట్లే విచారించి ఆ తర్వాత పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. చోరీ జరిగిన వెంటనే పోలీసులు స్పందించి ఉంటే ట్రాక్టర్ ఆచూకీ తెలిసి ఉండేదని బాధితుడు వాపోతున్నారు. ఇప్పటికైనా చోరీకి గురైన ట్రాక్టర్ విషయంలో దర్యాప్తు ముమ్మరం చేయాలని బాధితులతో పాటు స్థానికులు కోరుతున్నారు.

బాధ్యతల స్వీకరణ

కాశినాయన: మండల తహసీల్దారుగా వెంకటసుబ్బయ్య, డిప్యూటీ తహసీల్దారుగా రవిశంకర్‌లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేస్తున్న బాలనరసింహులు పెద్దముడియం తహసీల్దారుగా బదిలీ కాగా పెద్దముడియం తహసీల్దారుగా పనిచేస్తున్న వెంకటసుబయ్య ఇక్కడికి బదిలీపై వచ్చారు. బద్వేలు ఆర్డీఓ కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్న రవిశంకర్ మండల డిప్యూటీ తహసీల్దారుగా బదిలీపై ఇచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దారు ప్రసన్నలక్ష్మి బదిలీపై వెళ్ళారు.

గోపవరం: తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం తహసీల్దారుగా పనిచేస్తున్న ఉదయభారతిని బద్వేలు ఆర్డీఓ కార్యాలయ ఏఓగా నియమించారు. ఆమె స్థానంలో లింగాల తహసీల్దారుగా పనిచేస్తున్న త్రిభువన్‌రెడ్డి బదిలీపై గోపవరం మండలానికి రావడం జరిగింది.

కలసపాడు: మండల తహసీల్దారుగా మధురవాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మహబూబ్‌బాషా ఖాజీపేటకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో బి.కోడూరులో పనిచేస్తున్న ఆమె బదిలీపై వచ్చారు.

ఖాజీపేట: మండల తహసీల్దార్‌గా మహబూబ్ బాషా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సరస్వతి బదిలీ కావడంతో ఆ స్థానంలో కలసపాడులో తహసీల్దార్‌గా పనిచేస్తున్న మహబూబ్‌బాషాను ఇక్కడికి బదిలీ చేశారు.

చేగువేరా జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

బద్వేలు అర్బన్: నేటి విద్యార్థులు, యువత చేగువేరా జీవితాన్ని, పట్టుదలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ తెలిపారు. చేగువేరా 57వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయం జెవిభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఏరియా నాయకులు బి.అనిల్, పట్టణ అధ్యక్షులు నవీన్, పట్టణ నాయకులు మల్లేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో పోరుమామిళ్లకు నాలుగు పతకాలు


పతకాలు సాధించిన పోరుమామిళ్ల క్రీడాకారులు

పోరుమామిళ్ల: ఈనెల 6 నుంచి 8 వరకు తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో స్కూల్ గేమ్స్‌లో పోరుమామిళ్ల క్రీడాకారులు 4 పతకాలు సాధించినట్లు మాస్టర్ నాయబ్‌రసూల్ తెలిపారు. 78 కేజీల విభాగంలో చరణ్ బంగారు పతకం, 35 కేజీల విభాగంలో అబూబకర్ రజత పతకం, 59,63 కేజీల విభాగాల్లో సాజిత్, అమర్నాథ్ కాంస్య పతకాలు సాధించారన్నారు. మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో చరణ్ పాల్గొంటాడని నాయబ్ రసూల్ తెలిపారు. కోచ్‌లుగా సుభాష్, ఉస్మాన్ పాల్గొన్నారన్నారు.

రక్తదాన శిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్: చేగవేరా వర్ధంతి సందర్భంగా స్థానిక జిల్లా ఆస్పత్రి రక్తనిధి కేంద్రంలో బుధవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా చేగవేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజ్, నాయకులు రామకృష్ణన్, నవీన్, శ్రీను, బాబు పాల్గొన్నారు.

సరస్వతి నమస్తుభ్యం


ప్రొద్దుటూరు కల్చరల్: ముక్తి రామలింగేశ్వరస్వామి ఆలయంలో


ప్రొద్దుటూరు కల్చరల్: రతనాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో..


బద్వేలు అర్బన్ కోదండ రామాలయంలో అనంత పద్మనాభస్వామి శేషపాన్పు అలంకారం


దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఏడో రోజైన బుధవారం అమ్మవారు పలు రూపాల్లో దర్శనమిచ్చి అభయమిచ్చారు. అధిక ఆలయాల్లో సరస్వతీ అలంకారంలో కటాక్షించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకుని కనులారా దర్శించుకుని తరించారు. – సాక్షి, నెట్‌వర్క్


ప్రొద్దుటూరు కల్చరల్: వినాయక నగర్ చౌడేశ్వరిదేవీ ఆలయంలో..



ప్రొద్దుటూరు కల్చరల్: చెన్నకేశవ స్వామి ఆలయంలో..


ప్రొద్దుటూరు కల్చరల్: శివాలయంలో సరస్వతీదేవి


పోరుమామిళ్ల శ్రీకన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో..


రాజుపాలెం : సరస్వతీదేవి అలంకారంలో అంకాలమ్మ


బ్రహ్మంగారిమఠం : శ్రీ ఈశ్వరీదేవి మఠంలో సరస్వతీదేవి


దువ్వూరు: ప్రత్యేక అలంకరంలో కన్యకాపరమేశ్వరి


కలసపాడు: సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు


కాశినాయన : ధనలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు


మైదుకూరు: సరస్వతిదేవి అలంకరణలో అమ్మవారు

ఘనంగా బిందె సేవ మహోత్సవం


అమృతేశ్వరాలయంలో బిందెసేవ నిర్వహిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్: దసరా మహోత్సవాల్లో భాగంగా బుధవారం వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయ అమ్మవారి బిందె సేవ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కలశాల్లోకి అమ్మవారిని ఆవాహన చేసి పురవీధుల్లో వాసవీ నామస్మరణతో ఆర్యవైశ్యులు అట్టహాసంగా ఊరేగించారు. దారి వెంబడి భక్తులు కాయాకర్పూరాలు సమర్పించారు. 15 మంది కళాకారుల మహిళా వీరాగేస్ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అమృతేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అమ్మవారి కలశాన్ని తలమీద ఉంచుకుని బిందె సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరు రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నామా రమేష్‌బాబు, కార్యదర్శి నామా వాసు, పీఆర్ఓ ధారా సంతోష్, రఘువంశీ, కళాసాగర్, సుమంత్, కిరణ్, రవి, తల్లం అజయ్, కిశోర్, మనోహర్, నరేష్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. శివాలయం రాజరాజేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాల మధ్య కలశాలను తలమీద ఉంచుకుని పురవీధుల్లో బిందెసేవ నిర్వహించారు.

పోరుమామిళ్ల: ఆర్యవైశ్యుల బిందె సేవ పట్టణంలో వైభవంగా జరిగింది. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు విశ్వనాథుల ప్రసాద్, కార్యదర్శి యాదాల వెంకట సుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడు తులసి సుధాకర్‌ల ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరీ దేవస్థానం నుంచి పురవీధుల్లో అమ్మవారి కలశంతో భారీగా ఊరేగింపు జరిగింది. మూలా నక్షత్రం రోజు సరస్వతీ పూజతో బిందె సేవ నిర్వహించడం ఆనవాయితీ.

ఖాజీపేట: అమ్మవారిశాల నుంచి ఆర్యవైశ్య సభ్యులు అమ్మవారి ప్రతిమను తీసుకుని బిందే సేవా కార్యక్రమం చేపట్టారు. ఖాజీపేటలోని ఆర్యవైశ్య గృహాల వద్దకు వెళ్లి కార్యక్రమాన్ని అత్యత నిష్ఠతో పూర్తి చేశారు. సమావేశంలో ఆర్యవైశ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్: పట్టణంలోని ఆర్యవైశ్య యువకులు బుధవారం నిర్వహించిన బిందెసేవ వైభవంగా జరిగింది. స్థానిక అమ్మవారిశాల నుండి సాగిన గ్రామోత్సవంలో ఆర్యవైశ్య యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బిందె సేవను పోరుమామిళ్లరోడ్డు, మైదుకూరు రోడ్డుల మీదుగా నిర్వహించారు. దారి పొడవునా మహిళలు బిందెలతో నీటిని వారపోసి కలశస్థాపనకు పూజలు నిర్వహించారు.